# మహిళలకు ఉపాధి ఏర్పాటుకు కృషి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
దామోదర్ రాజనర్సింహ



ప్రజాఫక్షం /సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం లోని పోసానిపేట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్డి డిస్టలరీ ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హెల్త్ హబ్ గా తీర్చిదిద్దామన్నారు. సింగూరు ప్రాజెక్టు ద్వారా నియోజకర్గంలో 40 వేల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ కింద మరో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపోందించమన్నారు. అలాగే నిరుద్యోగులకు ,మహిళలకు పెద్ద ఎత్తున ఉపాది అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్ఆర్డి డిస్టలరీ ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమలోని అన్ని విభాగాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాలలో ఉన్న వారికి ఈ పరిశ్రమల్లో ఉపాది కల్పించడాన్ని మంత్రి స్వాగతించారు. ఈ పరిశ్రమ మరింత విస్తరించి రానున్న రోజుల్లో మరో 500 మందికి ఉద్యోగ ,ఉపాది, అవకాశాలు కల్పించేందుకు దోహద పడాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ బాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఆర్ ఆర్‌డి డిస్టలరీ ఎండి కొండల నిపుణ్ రెడ్డి, కంపెనీ డైరెక్టర్ త్రిష, మున్సిపల్ చైర్మన్ కృష్ణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, రామ్‌రెడ్డి, బండ అభిలాష్ రెడ్డి ,తీగల నర్సిరెడ్డి, సుదాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, అందోల్ జోగిపేట, మున్సిపాలిటీ కి చెందిన పలువురు కౌన్సిలర్లు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ.. నిందితుడి అరెస్టు



ప్రజాపక్షం / మంచిర్యాల క్రైం : మంచిర్యాల పట్టణం హమాలివాడలోని పెద్దమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన నిందితుడు గుమ్మడి సారయ్యను అరెస్టు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ తిరుపతి తెలిపారు. శుక్రవారం రాత్రి నిందితుడు ఆలయంలో మూడు వేల రూపాయలు దొంగతనం చేసినట్లు వెల్లడించారు. శనివారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో చేసిన మరికొన్ని దొంగతనాల విషయాలు వెలుగులోకి వచ్చాయని, గత ఏడాది నవంబరులో పట్టణంలోని ఎంసిసి ప్రాంతంలోని పోస్ట్ ఆఫీసులో రెండు మానిటర్లు, కీబోర్డు, జనరేటర్లను దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని తెలిపారు. అలాగే 19న హమాలివాడలోని హనుమాన్ ఆలయంలో ఐదు వేల రూపాయలు చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పిహెచ్‌సిలో ఓపి సేవలు విస్తరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు



ప్రజాపక్షం/కాగజ్ నగర్: కాగజ్ నగర్ మండలంలోని భట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషంటు సేవలను విస్తరించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిర్పూర్ శాసనసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సూచించారు. శనివారం ఆయన భట్టుపల్లి పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆస్పత్రి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి ఆసుపత్రి సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా ఓపి సేవలు పెంచాలని, అవసరమైన మందులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మాజీ ఎంపిటిసి పిరిసింగుల తిరుపతి, కౌన్సిలర్ చిప్పకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వ్యక్తిపై విచక్షణారహిత దాడి

ప్రాథమిక చికిత్స అందించిన 108 సిబ్బంది



ప్రజాపక్షం మెదక్ : మెదక్ పట్టణంలోని శ్మశాన వాటిక సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సజీద్ అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను శనివారం ఉదయం స్థానికులు గమనించి వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈఎంటీ రామవ్వ, పైలట్ రఘు బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుండగా, బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై టౌన్ ఎఎస్ఐ రుక్సానా బేగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి కారణాలు, దుండగుల వివరాలు కొనసాగిస్తున్నారు. ఘటనతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## 23 నుండి యథాతథంగా ప్రజావాణి

ప్రజాపక్షం / నస్పూర్ : జిల్లాలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుండి యథాతథంగా ప్రారంభం కానుంది. రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా ఆగినసోమవారం నుండి నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు గమనించి తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని ఆయన సూచించారు.


## దుష్ట సంస్కృతికి తెరలేపిన మంత్రి వివేక్

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి మున్సిపాలిటీలో యుద్ధ వాతావరణం సృష్టించి కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం నిర్వహించడం ఏమిటని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. శనివారం మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంఎల్ఎలు పుట్ట మధు, కోరుకంటి చందర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ మంత్రి వివేక్ అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని పార్టీ కార్యకర్తలుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా మంత్రి వివేక్, ఎంపి వంశీ కృష్ణ దుష్ట సంస్కృతికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. సిపిఐ, బిఆర్ఎస్ కూటమి 14 సీట్లను కైవసం చేసుకున్నప్పటికీ, మెజారిటీ ఉన్న పార్టీలకు చైర్మన్ పదవి ఇవ్వకుండా పోలీసులు, అధికార పార్టీ నాయకులకు ఎన్నికల అధికారులు తలొగ్గడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 16న జరగాల్సిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికను నాటకీయంగా వాయిదా వేసి, మరుసటి రోజు గెలిచిన కూటమి కౌన్సిలర్లను అడ్డుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. టిబిజికెఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కంబగోని సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా కొన్యాల




ప్రజాపక్షం / గజ్వేల్: సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా క్షీరసాగర్ సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సాదాని భూమయ్య యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు ఆశాదీప్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.అంతేకాకుండా గతంలో సర్పంచులకు ప్రభుత్వం బాకీపడిన నిధుల విడుదల కోసం రాష్ట్ర కమిటీతో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు ప్రకటించారు.

## మారుమూల గ్రామాలకు సెల్‌ఫోన్ సేవలు

ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజాపక్షం/కుంటాల : కుంటాల మండలంలోని వెనుకబడిన మారుమూల గ్రామాలలో సెల్‌ఫోన్ సేవలను త్వరలోనే అందుబాటులోకి తెచ్చి సాంకేతిక పరిజ్ఞానం అందేలా కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.శనివారం కుంటాల మండలంలో ఆయన పర్యటించారు.అంతకుముందు అంబకంటి గ్రామంలో రూ.3 కోట్ల వ్యాయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.కుంటాలలోని రైతు వేదికలో 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.సూర్యపూర్,దౌనెల్లి గ్రామాలలో నెల రోజులలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను ఏర్పాటు చేయించి సెల్ ఫోన్ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు.గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చే యించి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని చెప్పారు.కుంటాల మండలాన్ని రానున్న రోజుల్లో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాననిన హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను పలువురు శాలువాతో ఘనంగా సనామనించారు.స్థానిక సర్పంచ్ జక్కుల గజేంధర్,తహసిల్దార్ కమల్‌సింగ్,ఎంపీడీఓ అల్లాడి వనజ,సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లింగురాం పటేల్,అంబకంటి సర్పంచ్ ముజిగే రాణి, జాదవ్ జ్యోతి బాయి,ఆయా గ్రామాల సర్పంచులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 'పది' వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం మెదక్ : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సమయాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని తల్లితండ్రులు తప్పనిసరిగా విద్యార్థులు పాఠశాలకు హాజరు అయ్యే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం చిన్న శంకరంపేట్ మండలం సూరారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఏ ఏ సబ్జెక్టు ను ఏ విధంగా చదవాలో వివరించారు. పలు మోటివేషన్ కథలు చెప్పారు. పదవ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, సైన్,వివిధ భాష సామర్థ్యాల ను పరిశీలించి, పలు గణిత సమస్యలను పరిష్కరించారు. పరీక్షల సమయంలో సమయాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలన్నారు. గుణాత్మక అభ్యస ప్రమాణాలు పెంపొందించడం లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. అందరూ ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా కు మంచి పేరు తేవాలన్నారు.

## నిబంధనల మేరకే కౌన్సిలర్ల అనుమతి

మంచిర్యాల డిసిపి భాస్కర్ వెల్లడి



ప్రజాపక్షం/మంచిర్యాల : క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కేవలం నిబంధనల మేరకే కౌన్సిలర్లకు అనుమతి ఇవ్వడం జరిగిందని మంచిర్యాల డిసిపి భాస్కర్ స్పష్టం చేశారు. శనివారం డిసిపి కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి కౌన్సిల్ హాల్ సమీపంలోకి కేవలం ఓటు హక్కు ఉన్న కౌన్సిలర్లను మాత్రమే అనుమతించామని వివరించారు. బిఆర్ఎస్ నాయకులు వందలాది వాహనాలతో రావడంతో శాంతిభద్రతల దృష్ట్యా వారిని రైల్వే గేటు వద్దే నిలిపివేసి, కేవలం కౌన్సిలర్ల వాహనాలను మాత్రమే పంపినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసులపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ వర్గాలు తమ ప్రయోజనాల కోసం పోలీసులను దోషులుగా చూపుతూ ప్రచారం చేస్తున్నాయని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓటర్లతో పాటు సంబంధిత మంత్రి, ఎంఎల్ఎ కూడా నిబంధనల ప్రకారం పరిమిత వాహనాల్లోనే రావాలని ముందే సూచించినట్లు వెల్లడించారు. ఎన్నికల నిబంధనల అమలులో తాము నిష్పక్షపాతంగా వ్యవహరించామని, సమయం మించిపోవడానికి పోలీసుల ఆంక్షలే కారణమన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు.

## గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాఫక్షం /సంగారెడ్డి : పల్లేల సర్వతో ముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య పిలుపు నిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూ చించారు. ప్రజలకు సమర్థవంతమైన పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు ,విధులను సక్రమంగా వినియోగిస్తూ అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పా టు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు పారిశుద్ధ్యం ,రహదారులు, విద్య వైద్యం వంటి మౌళిక సదుపాయాల అభిప్రాయాల అభివృద్ధి ప్రాదాన్యత ఇవ్వాలని ప్రజలతో మమేకమై భాధ్యత యుతంగా వ్యవహరించాలని హితువు పలికారు. ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చి దిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపోందించుకోవాలని, పారదర్శకత బాద్యత యుత వైఖరి పాటించాలని సూచించారు. జడ్పీ సీఈఓ ,ఇన్‌చార్జ్, జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డిఎల్పీ వోలు ,ఎంపిడిఓలు మాస్టర్, ట్రైనర్లు ఆయా సర్పంచులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ అభివృద్ధికి సమన్వయంతో కృషి

మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్
కొత్తపల్లి అనిత




బిఆర్ఎస్ కౌన్సిలర్లు విద్యావతి, స్వాతి, స్వప్న, భాగ్యలక్ష్మి, వనమల రాము, మహమ్మద్ వసీం, బాబురావు, పోచన్న, యూసుఫ్, మాణిక్యరావు పాల్గొన్నారు.

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : పట్టణ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత పిలుపునిచ్చారు. శనివారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ బి. తిరుపతిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కమిషనర్ చేపడుతున్న అభివృద్ధి చర్యలను అభినందిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ కమిషనర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో

## గ్రామ స్వరాజ్యానికి ప్రజాప్రతినిధులే పునాదులు

ఎంపిఒ గోవర్ధన్



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండల కేంద్రంలో ''గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి,పారదర్శక పాలనలో వార్డు సభ్యులు,ఉపసర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకం.మీ బాద్యతలను మీరు తెలుసుకున్నప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది''అని మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ)గోవర్ధన్ పేర్కొన్నారు.శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ముగిసిన ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యుల ఐదు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

**అవగాహనతోనే అభివృద్ధి :** ఈ సందర్భంగా ఎంపీఓ గోవర్ధన్ మాట్లాడుతూ..ఫిబ్రవరి 17 నుండి 21 వరకు జరిగిన ఈ మొదటి బ్యాచ్ శిక్షణలో పాలనాపరమైన మెళకువలను నేర్పించడం జరిగిందన్నారు.''గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు,వాటి వ్యయం,రికార్డుల నిర్వహణ,పల్లె ప్రగతి వంటి కార్యక్రమాలల్లో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలి.పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి''అని ఆయన సూచించారు.నిష్ణాతులైన సెక్రటరీలతో శిక్షణ ఇప్పించడం వల్ల క్షేత్రస్థాయి సమస్యలపై సభ్యులకు పూర్తి అవగాహన వచ్చిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

### బాధ్యతాయుత పాలన..

ఎంపిడీవో అరుణరాణి పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణ ద్వారా సభ్యులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.శిక్షణ ముగిసిన అనంతరం వార్డ సభ్యులకు సర్టిపికెట్లు అందజేస్తూ,కేవలం సర్టిఫికెట్లకే పరిమితం కాకుండా,ఇక్కడ నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో అమలు చేయాలని కోరారు.ఈ ముగింపు వేడుకలో ఉపసర్పంచ్ నడుకుడ సుఖేష్,పంచాయతీ కార్యదర్శులు మహేందర్,ప్రవళిక,సంధారాణి,ఆకాష్ నాయక్,స్వాతి,టీఓటీలు శ్రావణ్,సునీల్,కిరణ్,రాకేష్‌లతో పాటు వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.


## ప్రజలు చల్లగా ఉండాలి

-ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

ప్రజాఫక్షం /హత్నూర : హత్నూర మండలం తుర్కల ఖానాపూర్ గ్రామంలో శనివారం ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలు ,సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని కోరారు. నిర్వాహకులు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల మాజీ ఎంపిపి వావిలాల నర్సింలు, బిఆర్ఎస్ పార్టీ మండల అద్యక్షుడు రాంచంద్రారెడ్డి, శ్రీకాంత్, వీరేందర్ సీనియర్ నాయకులు సంతోష్‌రెడ్డి ,సాజిద్ యువ నాయకులు కిషోర్, ఇబ్రాహీం పాల్గొన్నారు.



## అక్రమ పశువుల రవాణా పట్టివేత



ప్రజాపక్షం / సిర్పూర్ టి : కౌటాల మండలం నుండి వాంకిడి వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను సిర్పూర్ టి పోలీసులు వెంకట్రావుపేట సమీపంలో పట్టుకున్నారు. శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా సరైన అనుమతులు లేకుండా పది పశువులతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. నిందితులు వాంకిడి గోవిగావ్ గ్రామానికి చెందిన షేక్ బషీర్, హైదరాబాద్ షాలిబండకు చెందిన మహమ్మద్ రియాజ్ అని గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## బాల్యవివాహాలను నిర్మూలిద్దాం




ప్రజాపక్షం/నర్సాపూర్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తి ఎం.హేమలత ఆదేశాల మేరకు నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్ లో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. రుస్తుంపేట్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి కార్యక్రమానికి ఆహ్వానించగా ముఖ్య అతిథులుగా మండల్ లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాది సి.హెచ్. స్వరూప రాణి లీగల్ సర్వీస్ లుక్ అదాలత్ బెంచ్ మెంబర్ ఎస్.మధు శ్రీ శర్మ, మండల విద్యాధికారి ఎంఈఓ తారా సింగ్, ఐసిడిఎస్ సూపర్వైజర్.లు సరళ .మోహతాకుబెగం.మారియు, నర్సాపూర్ మండల ఏఎస్ఐ శివకుమార్, మాజీ ప్రభుత్వ సహాయ న్యాయవాది పి.సుధాకర్, లు హాజరై ఇరువురు మాట్లాడుతూ, వరకట్నాని నిషేధించుటకు, వరకట్న నిషేధ చట్టంపై, బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థిని విద్యార్థులు చట్టాల పైన అవగాహన కలిగి ఉండి మీ గ్రామాలలో కానీ మీ ఇంటి పక్క ఇండ్లలో కానీ వరకట్నా వ్యవస్థను నిర్మూలించే దిశగా విద్యార్థులు అవగాహన కల్పిస్తూ పూర్తిస్థాయిలో నియంత్రించాలని తెలియజేశారు. అదే విధంగా చిన్నపిల్లలకు బాల్య వివాహాలు చేయవద్దని, బాల్యవివాహాలకు పాల్పడితే చట్టరీత్యా ఇరు కుటుంబాలను చట్టరీత్యా కఠినంగా శిక్షించబడతారు అన్నారు, విద్యార్థిని విద్యార్థులకు గ్రామీణ ప్రాంత ప్రజలకు వివిధ చట్టాల పైన న్యాయ విజ్ఞానాన్ని కల్పించడం కోసం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుంది అన్నారు.

